పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది రిజర్వాయర్ బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిత్యం నీటితో కళకళలాడుతూ ఉండేది. రైతాంగానికి ఆదరువుగా నిలిచింది. నిరుడు మండుటెండల్లో సైతం మే నెలలో ప్రాజెక్టు నిండుకుండలా కనిపించింది.

నందిమేడారం రిజర్వాయర్ అడుగంటింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టును పట్టించుకోకపోవడం, ఎత్తిపోతలు నిలిపివేయడంతో నీరు లేక బోసిపోయింది. నిరుడు ఇదే సమయానికి నీటితో కళకళలాడిన ప్రాజెక్టు, ఇప్పుడు ఎడారిగా మారింది. -ధర్మారం

నిమిషాల వ్యవధిలో తండ్రి, కూతురు మృతి

- భర్త వేధింపులతో కూతురు ఆత్మహత్యాయత్నం
- బిడ్డను చూసి వస్తుండగా రోడ్డుప్రమాదంలో తండ్రిదుర్మరణం
- చికిత్సపొందుతూ కన్నుమూసిన కూతురు

జ్యోతి,రాథోడ్ లక్ష్మణ్ (ఫైల్)

నవీపేట/రెంజల్, మే 24: భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కూతురిని చూసేందుకు వెళ్లిన తండ్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. నిమిషాల వ్యవధిలోనే ఇద్దరూ మృతి చెందడంతో వీరన్నగుట్ట లో విషాదం నెలకొన్నది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన రాథోడ్ లక్ష్మణ్ (52) తన కూతురు జ్యోతి (36)కి నవీపేట్ మండలం అబ్బాపూర్ తండాకు చెందిన మాలోత్ ప్రకాశ్‌తో వివాహమైంది. నాలుగేండ్ల క్రితం మరో పెండ్లి చేసుకున్న ప్రకాశ్ మొదటి భార్య జ్యోతిని 5 లక్షల అదనపు కట్నం, ఎకరం భూమి తేవాలని వేధించిసాగాడు. వేధింపులు భరించలేక జ్యోతి ఈ నెల 22న పురుగు మందు తాగింది. ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కూతురిని చూసేందుకు గురువారం దవాఖానకు వచ్చిన తండ్రి లక్ష్మణ్ తిరిగి బైక్‌పై వెళ్తుండగా, ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి దవాఖానలో చేరాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న జ్యోతి చనిపోగా, అరగంట వ్యవధిలో తండ్రి కూడా ప్రాణాలు వదిలాడు.

అన్నదాతలే అక్కడ అడ్డాకూలీలు

మొదటిపేజీ తరువాయి...

పల్లెను వదిలి పట్నం బాట పట్టాల్సిన పరిస్థితులు వచ్చాయి. నలుగురికీ పట్టెడన్నం పెట్టిన అన్నదాతే హైదరాబాద్ గడ్డమీద అడ్డా కూలీగా మారాల్సిన దుస్థితి ఏర్పడింది.

నగరంలో ఏ అడ్డా మీద చూసినా..చేతిలో సద్దిబువ్వ..మెడలో తువ్వాలు..తోడుగా ఇంటామెతో రైతు దంపతులే కనిపిస్తున్నారు. ఒక్కొక్కరిది ఒక్కో చరిత్ర. కదిలిస్తే కన్నీళ్లు.. మాట కలిపితే మౌనరాగాలు. బోర్లేసి బొక్క బోర్లపడ్డ బతుకులు. కల్లబొల్లి మాటలతో అన్నదాతలను ఆశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కాక చేతులు ఎత్తివేయడంతో... ఐదారు నెలలుగా నగరంలో వలసలు పెరిగిపోయాయి. అడ్డా కూలీలుగా మారుతున్న రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోపరిధిలో బాచుపల్లి, మల్లంపేట్, నిజాంపేట్, ప్రగతినగర్, గండిమైసమ్మ, షాపూర్‌నగర్, చింతల్, జగద్గిరిగుట్టతో పాటు, నగర వ్యాప్తంగా పలు చోట్ల ఉన్న బస్తీల్లో నివాసం ఉంటూ రైతు దంపతులు అడ్డా కూలీలుగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో చెల్లించాల్సిన రైతు బంధు రాక, చేసిన అప్పులు తీరక... అప్పులు తీర్చుకునే ఉపాయం కోసం నగర బాట పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ వ్యాప్తంగా సాగు నీటి కష్టాలు రావడంతో... వేసిన బోర్లన్నీ వట్టిపోయి, పంట పొలాలను ఎండబెట్టలేక వ్యవసాయానికి దూరమైతున్నారు. ఇక అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామన్నా కాంగ్రెస్ ప్రభుత్వం... ఆరు నెలలు గడుస్తున్నా పంద్రాగస్టు గడువు చెప్పడంతో ... బ్యాంకర్ల వేధింపులు ఒకవైపు.. అప్పులోల్ల బాధలు మరోవైపు.. సమాధానం చెప్పుకోలేక.. ముఖాలు చూపించలేక నగరానికి వలస రావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కనీసం ఇక్కడైన ఏదైనా నిర్మాణ పనులు చేసుకుందామంటే... ఎన్నికల హడావుడి కారణంగా నిర్మాణ రంగం లోనూ పనులు కుంటుపడి పని దొరకడమే కష్టంగా మారిందని చెబుతున్నారు.

కొంపల్లి అడ్డాపై పనుల కోసం వేచి చూస్తున్న అడ్డాకూలీలు

నాడు పల్లెకు..నేడు పట్నానికి వలసలు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాల నుంచి నగరానికి ఉపాధి కోసం వలసొచ్చే బడుగులు ఎంతో మంది ఉండేవారు. స్వరాష్ట్రం ఏర్పాటైన తర్వాత వలసలకు అడ్డుకట్ట వేసేలా కేసీఆర్ పాలనసాగించారు. స్థానికంగానే మెరుగైన తాగు, సాగు నీటి సదుపాయాలు, రైతులకు భరోసానిచ్చేలా బీమా, రైతు బంధు, రుణమాఫీ వంటి పథకాలు, మద్దతు ధరతోపాటు, సకాలంలో ధాన్యం కొనుగోళ్లతో కేసీఆర్ ప్రభుత్వం రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నది. పదేండ్ల కాలంలో ఎండిన చేలన్నీ పచ్చని పొలాలుగా మారిపోయాయి. స్థానికంగానే చేతి నిండా పనితో పట్నం నుంచి పల్లెలకు వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మళ్లీ కష్టాలు మొదలయ్యా. అర్ధరాత్రి కరెంటు, సాగునీటి ఇబ్బందులు, జాడలేని రైతు ప్రోత్సాహకాలతో వ్యవసాయమే సంక్షోభంలో పడింది. దీంతో పంటలు సాగు చేయాల్సిన రైతన్నలు కూడా పంట పొలాలను దూరం చేసుకుని పట్నానికి చేరువయ్యారు. అడ్డామీది కూలీలయ్యారు. ఉపాధి కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు.

బోరు ఎండిపోయింది

మాది జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం మీదికొండ గ్రామం. మాకు 5 ఎకరాల భూమి ఉంది. బోరుబావిలో నీళ్లు లేక వరిపంట ఎండిపోయింది. ఊర్లో ఉపాధిలేక పని కోసం హైదరాబాద్‌లోని చింతల్‌కు భార్య, ముగ్గురు పిల్లలతో వలస వచ్చాం. రెండు నెలలుగా చింతల్‌లోని అడ్డా మీద కూలీగా పని చేసుకుంటున్నా. భార్య కూడా కూలికి పోతోంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నీరు, కరెంట్ పుష్కలం. పంట కూడా బాగా పండించిన.

- కాయితాలరవి, చింతల్ అడ్డా

రుణమాఫీ కాలేదు.. అప్పులపాలయ్యా

మాది మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచోల గ్రామం. నాకు ఎకరంన్నర భూమి ఉంది. కరెంట్ మునుపటి లెక్క ఉంటలేదు. బోర్ల నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. రుణమాఫీ చేయకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. ఊర్లో ఉపాధి కరువై కుత్బుల్లాపూర్‌కు వలస వచ్చాం. భార్య కూడా నాతోపాటు అడ్డాకూలీగా పనిచేస్తోంది. రోజూ పని కూడా దొరకడంలేదు. వచ్చే డబ్బులు కిరాయి, ఖర్చులకే సరిపోతోంది.

- మద్దూరు సాయి, చింతల్ అడ్డా

రోజూ పని దొరకతలేదు

బాన్సువాడలో నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇన్నాళ్లూ అక్కడే ఎవుసం చేసుకుంటూ బతికా. ఇప్పుడు వ్యవసాయం చేయాలంటే పెట్టుబడి పెరిగింది. దిగుబడి అంతంతగానే ఉంది. బోర్లలో నీరు లేవు. కరెంట్ సమస్యలతో రెండు పంటలు వేసే పరిస్థితి లేదు. ఎండాకాలంలో పల్లెల్లో పని దొరకదు. అందుకే కుటుంబంతో హైదరాబాద్ వచ్చి అడ్డాకూలీగా మారాము. ఇక్కడ కూడా రోజూ పని దొరకడంలేదు. ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తే మళ్లీ వ్యవసాయం చేసుకుంటా.

- కాశీరాం, గండిమైసమ్మ అడ్డా

ఏడు బోర్లు వేశాం

మాకు రెండెకరాల భూమి ఉంది. నీటి వసతులు లేక ఏడు బోర్లు వేశాం. ఒక్కటి కూడా పడలేదు. కండ్ల ముందట పొలం ఉన్నా..సాగుకు నీటి లేవు. పొట్ట చేత పట్టుకొని వలస వచ్చి రోజువారీ కూలీకి వెళ్తున్నాం. బోర్లు వేసేందుకు మూడు లక్షలు అప్పు తీసుకొచ్చినం. ఇప్పుడు బతుకే భారమై పట్నం వచ్చి అడ్డామీది కూలీలయ్యాం. రోజూ పని దొరికితే నెలంతా కిరాయిలు కట్టుకొని ఖర్చులకు వెళ్లదీసుకుంటున్నాం. చేసిన అప్పులకు మిత్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

- స్వరూప, మెదక్(కొంపల్లి లేబర్ అడ్డా)

నీళ్లులేకపోతే బతకడమే కష్టం

కేసీఆర్ సార్ ఉన్నప్పుడే కాల్వల నీళ్లు వచ్చేది. ఇప్పుడు కాల్వలు ఎండిపోయాయి. నీళ్లు లేవు. ఎకరం భూమిని కౌలుకు చేసుకొని ఊళ్ల ఉండేది. ఇప్పుడు కౌలు పొలానికి సాగు నీరు లేకపోవడంతో పనులు లేక పట్నం వచ్చాం. చాలీచాలని కూలీ డబ్బులతో రోజువారీ ఖర్చులను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రేవంత్‌రెడ్డి వచ్చి ఆరు గ్యారంటీలు అన్నాడు. కనీసం ఊర్లలో గతంలో వచ్చే కాల్వలకు నీళ్లు తేలేకపోతున్నాడు. ఇలా ఉంటే బతుకడం చాలా కష్టం.

- యాదగిరి,నర్సాపూర్(కొంపల్లి అడ్డా)

ఊర్ల రాజులెక్క బతికినం

ఊర్లలో వ్యవసాయ పనులు చేసుకుంటూ రాజులెక్క బతికినం. ఇప్పుడు వ్యవసాయ పనులు తగ్గిపోయినయి. నీళ్ల పసతి లేక పంటలు సాగు చేయడం తక్కువైంది. పనులు లేకుండా పోయాయి. బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చినం. ఇక్కడ పనులు దొరికితే బుక్కెడు తిండి, బట్టకు సరిపోతుంది. కిరాయిలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నాం.

- సాయిరాం, కామారెడ్డి(కొంపల్లి అడ్డా)

కాలేజీల్లో అక్రమాలను అరికట్టాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే24 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించి పలు ప్రైవేట్ కాలేజీలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ సీట్లకు రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని, కన్వీనర్ కోటా సీట్లను స్లైడింగ్ చేస్తూ అమ్ముకుంటున్నాయని ఆరోపించారు.

సజావుగా పాలిసెట్.. 89% విద్యార్థులు హాజరు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): పాలిసెట్ పరీక్షను శుక్రవారం 259 పరీక్షాకేంద్రాల్లో సజావుగా నిర్వహించారు. 92,808 మందికి 82,809 మంది (89.23శాతం) పరీక్షకు హాజరైనట్టు సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ మొదటి వారంలో ఫలితాలు విడుదలకానున్నాయి. పాలిటెక్నిక్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ శుక్రవారం విడుదలైంది. జూన్ 20 నుంచి మొదటి విడత, జూలై 7 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వివరాల కోసం https://tgpolycet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. జూన్ 3 నుంచి 13 వరకు పరీక్షలు జరగనున్నాయి.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు రెండో భాష పేపర్‌కు పరీక్షలు నిర్వహించారు. ఫస్టియర్‌లో ఖమ్మం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు, సెకండియర్‌లో హైదరాబాద్‌లోఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా పట్టుకున్నారు. ఫస్టియర్ పరీక్షలకు 85,165 మందికి గానూ 78,113 విద్యార్థులు, సెకండియర్ పరీక్షలకు 32,310 మందికి గానూ 29,625 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

రేపే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఐఐటీల్లోని బీటెక్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం జరగనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -1కు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్ -2 పరీక్షను నిర్వహిస్తారు. జాతీయంగా 1.91లక్షల మంది, తెలంగాణ నుంచి 24,121మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

జూన్ 27 తర్వాత ఎప్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): బీటెక్ ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఎప్‌సెట్ అడ్మిషన్స్ కమిటీ సమావేశంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ ఏడాది జోసా (జేఈఈ) కౌన్సెలింగ్ తర్వాతే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ జరగనున్నది. గతంలో జేఈఈకి ముందే సీట్లను భర్తీచేసేవారు. టాపర్లు మొదట ఎప్‌సెట్‌లో అడ్మిషన్లు పొంది ఆ తర్వాత ఐఐటీలు, ఎన్ఐటీల్లో చేరేవారు. దీంతో సీట్లు మిగిలేవి. ఇలా మిగలకుండా ఉండేందుకు జోసా కౌన్సెలింగ్ తర్వాతే ఇంజినీరింగ్ సీట్లను భర్తీచేయాలని నిర్ణయించారు. దీంతో జూన్ 27 తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభించనున్నారు. పూర్తి వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

కన్వీనర్ కోటాలో సీట్ల సెంట్రలైజ్డ్ స్లైడింగ్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది నుంచి అన్ని కాలేజీల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో ఇంటర్నల్ స్లైడింగ్‌ను కన్వీనర్ ద్వారా చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఆయా సీట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. గతంలో స్లైడింగ్‌ను కాలేజీలు చేపట్టేవి. దీంతో కొన్ని కాలేజీలు సీట్లను బ్లాక్‌చేసి విక్రయించుకునేవి. సెంట్రలైజ్డ్ స్లైడింగ్ విధానంలో కాలేజీలు ఎలాంటి అవకతవకలకు పాల్పడే అవకాశముండదు. ఒక కాలేజీలో సీటు పొందిన విద్యార్థి, అదే కాలేజీలో మరో బ్రాంచి లేదా మరో కోర్సులో సీటు ఖాళీగా ఉంటే ఆయా సీటును కేటాయించడాన్ని ఇంటర్నల్ స్లైడింగ్ అంటారు.

సెంట్రలైజ్డ్ స్లైడింగ్ షెడ్యూల్

స్లైడింగ్ ఆప్షన్లు	ఆగస్టు 12, 13
ఆప్షన్స్ ఫ్రీజింగ్	ఆగస్టు 13
సీట్ల కేటాయింపు	ఆగస్టు 16కు ముందు
అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడింగ్	ఆగస్టు 16, 17

జూన్ 8 నుంచి ఈసెట్ వెబ్‌కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే ఈసెట్ వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శుక్రవారం ఈసెట్ ప్రవేశాల కమిటీ సమావేశంలో విడుదల చేశారు. మొదటి విడత కౌన్సెలింగ్ జూన్ 8 నుంచి ప్రారంభంకానుంది. జూలై 30లోపు అడ్మిషన్లు పూర్తిచేస్తారు. వివరాల కోసం https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ఎట్టకేలకు గురుకుల పీఈటీ పరీక్ష ఫలితాలు విడుదల

29 నుంచి జూన్ 4వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఐదు గురుకులాలకు సంబంధించిన పీఈటీ పోస్టుల రాత పరీక్ష ఫలితాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. 1:2 నిష్పత్తి ప్రకారం 1,185 మంది అభ్యర్థులకు ఈ నెల 29 నుంచి జూన్ 4 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు శుక్రవారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటించారు. ఐదు గురుకులాల్లో కలిపి 616 పోస్టులతో 2017లో నోటిఫికేషన్ విడుదల చేశారు. నాటి నుంచి పీఈటీ ఉద్యోగాల భర్తీలో ఎన్నో వివాదాలు చుట్టుముట్టాయి. తొలుత బీపీఎడ్ అభ్యర్థులు, అనంతరం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిప్లొమా అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. రెండు నెలల క్రితం హైకోర్టు తీర్పు వెల్లడించగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆ ఫలితాలు పెండింగ్‌లో పెట్టి శుక్రవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సీవోఈ గురుకులాల్లో 3300 సీట్ల భర్తీ

హైదరాబాద్, మే24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ జూనియర్ కాలేజీల్లో 3680 సీట్లకు గానూ 3300సీట్లు భర్తీ అయినట్టు అధికారులు వెల్లడించారు. మిగిలిన 360 సీట్లను కూడా త్వరల్లో భర్తీ చేస్తామని ప్రకటించారు.

వేతనాలు లేక ఒత్తిడి.. 104 డ్రైవర్ హఠాన్మరణం

- విధుల్లో ఉండగానే ఉద్యోగికి గుండెపోటు
- దవాఖానలో సీపీఆర్ చేస్తుండగానే మృతి
- 5 నెలలుగా వేతనాలు రాక మానసిక క్షోభ
- జిల్లా వైద్యాధికారి వేధింపులతోనే అంటున్న మృతుడి బంధువులు, తోటి ఉద్యోగులు

రాజ్‌కుమార్ (ఫైల్)

జగిత్యాల, మే 24 (నమస్తే తెలంగాణ): సర్కారు నిర్వాకమో, అధికారుల వేధింపులో తెలియదు గానీ 104 అంబులెన్స్ డ్రైవర్ హఠాన్మరణం చెందారు. తోటి ఉద్యోగితో విధుల కోసం బైక్‌పై వెళ్లి కార్యాలయానికి తిరిగొస్తుండగా, తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయాడు. వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించి, సీపీఆర్ చేసి చికిత్స చేస్తుండగానే ప్రాణాలు కోల్పోయాడు. ఆరునెలలుగా ప్రభుత్వం వేతనం ఇవ్వకపోవడం, దీనికి తోడు జగిత్యాల డీఎంహెచ్‌వో శ్రీధర్ వేధింపుల వల్లే మానసిక వేదనకు గురై గుండెపోటుతో చనిపోయాడని మృతుడి కుటుంబసభ్యులు, 104 సిబ్బంది ఆరోపిస్తున్నారు. వారి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన రాజకుమార్ (52)కు 15 ఏండ్ల క్రితం వివాహం జరగ్గా, పదేండ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి జగిత్యాలలోని తన అక్క ఇంట్లోనే ఉంటున్నాడు. 104 అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దానిపై వచ్చే ఆదాయంతోనే రాజకుమార్ జీవితాన్ని వెల్లదీస్తున్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు 104 సిబ్బందికి రెగ్యులర్‌గా వేతనాలు చెల్లిస్తూ వచ్చింది. డిసెంబర్ వరకు వేతనాలు సక్రమంగానే మంజూరయ్యాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అందని వేతనాలు

కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 104 సిబ్బందికి వేతనాలు మంజూరు కాలేదు. దీంతో రాజకుమార్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుగున్నాడు. దీనికి తోడు కొన్నాళ్లుగా రాజకుమార్‌కు 104 డ్రైవర్ బాధ్యతలు కాకుండా, వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సెక్యూరిటీ గార్డుగా, స్వీపర్‌గా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీధర్ మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో రాజకుమార్ తీవ్ర మానసిక క్షోభకు గురయ్యాడు. పలుసార్లు రాజకుమార్ జిల్లా వైద్యాధికారిని కలిసి తనకు డ్రైవర్ విధులు ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పనులు, మరుగుదొడ్లు క్లీన్ చేసే పనులు చేయడానికి మనసు అంగీకరించడం లేదని వాపోయాడు. 5 నెలలుగా వేతనాలు రాక, గార్డు, స్వీపర్ విధులు చేయలేక, రాజకుమార్ తీవ్ర క్షోభకు, ఒత్తిడికి లోనయ్యాడు. డీఎంహెచ్‌వో మూడు రోజులు వరుసగా డ్యూటీ చేయాలని ఆదేశాలివ్వడంతో రాజకుమార్ తీవ్ర వేదనతోనే విధులు నిర్వర్తించాడు. ఈ క్రమంలోనే ఆయన అలసటకు గురై గుండెపోటు బారిన పడి మృతిచెందాడని ఆయన బంధువులు, తోటి ఉద్యోగులు ఆరోపించారు.

మరమ్మతుల్లో జాప్యం.. మేడిగడ్డకు ముప్పు

- ముందే స్పందించని సర్కారు
- ఐదు నెలలుగా టెస్టుల పేరిట జాప్యం
- ఫలితంగా పియర్ల కింద మరింత గ్యాప్
- ఎన్డీఎస్‌ఏ సిఫారసులతో చలనం
- ఆగమేఘాలపై మరమ్మతులు
- మూడు గేట్లు తెరిచేందుకు ప్రయత్నాలు
- అసత్య ప్రచారాలపై ఇంజినీర్ల అసహనం

బరాజ్‌లోని 21వ బ్లాకు సమీపంలో ఏర్పడిన గొయ్యి

హైదరాబాద్/ జయశంకర్ భూపాలపల్లి, మే 24 (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్: కాళేశ్వరం ప్రాజక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ మరమ్మతులపై ప్రభుత్వం ఐదు నెలలుగా కాలయాపన చేయడంతో మరింత ముప్పు వాటిల్లింది. కుంగిన పియర్ల కింద మరికొంత గ్యాప్ ఏర్పడింది. పనుల్లో జాప్యం చేయడంతో 21వ పియర్ సమీపంలో ఊట నుంచి నీరు లోనికి వెళ్తున్నది. చిన్నపాటి బుంగలా మారేసరికి ఇసుక నింపే ప్రయత్నం చేస్తున్నారు.

విచారణ పేరిట జాప్యం

అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 20వ పియర్ కుంగడంతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రాజకీయం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత బరాజ్‌కు మరమ్మతులు చేస్తే బీఆర్ఎస్‌కే పేరు వస్తుందని ప్రాజెక్టును పక్కన పెట్టింది. నెలల తరబడి విచారణ, ఈఆర్సీ, జియలాజికల్ టెస్టుల పేరిట కాలయాపన చేసింది. చివరికి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో జ్యుడీషియరీ కమిషన్ ఏర్పాటు చేశారు. కాగా ఘోష్ కమిషన్ మేడిగడ్డ ప్రాజెక్టును రిపేరు చేయాలని సూచించింది. ఎన్డీఎస్‌ఏ సైతం మేడిగడ్డ పనులు చేపట్టాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఎల్ అండ్‌టీ మరమ్మతులను మొదలుపెట్టింది.

నిర్లక్ష్యంతో పియర్ల కింద గ్యాప్

ప్రస్తుతం నీటిని కిందికి వదిలినా పనుల్లో కాలయాపన జరగడంతో 21వ పియర్ సమీపంలో ఊట నుంచి నీరు లోపలికి వెళ్తున్నది. దీన్ని అధికారులు ఇసుక బస్తాలతో నింపే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపైనా రాద్ధాంతం చేయడంపై ఇంజినీర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 15వ గేట్‌ను ఓపెన్ చేసిన అధికారులు 19, 20, 21వ పియర్ల వద్ద ఉన్న గేట్లను తెరిచేందుకు యత్నిస్తున్నారు. వారం క్రితం వీటిని ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా రబ్బర్ సీల్ రాకపోవడంతో వాయిదా వేశారు. బరాజ్ మహారాష్ట్ర వైపు ఉన్న ఒకటో బ్లాక్ నుంచి ఏడో బ్లాక్ వరకు చేపట్టిన కాఫర్ డ్యాం పనులు కొనసాగుతున్నాయి. దెబ్బతిన్న పియర్ వద్ద రాఫ్ట్ కిందిభాగంలో ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాల్లో ఇసుక బస్తాలు అమర్చుతున్నారు. మరమ్మతుల కోసం ఎల్‌అండ్‌టీ సంస్థ యంత్రాలను తరలించినా అవి నది ఒడ్డునే ఉన్నాయి. ట్రాక్టర్లు, డోజర్లతో ఏడో బ్లాకు వద్దకు దారి పనులు చేస్తున్నారు. శుక్రవారం నుంచి బరాజ్ ఎగువన ఒకటి, దిగువన ఒక ఎక్స్‌కవేటర్‌తో మాత్రమే ఇసుక తీసే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుక, రాళ్లను తొలగిస్తున్నారు. కాగా బరాజ్ వద్ద భారీ శబ్దాలు, భారీ బొరియలు అంటూ ప్రచారం జరుగుతుండటంతో పరిశీలించేందుకు నేడు మేడిగడ్డకు నిపుణుల కమిటీ రానుందని తెలిసింది.

జియోట్యూబ్‌లతో తక్కువ ఖర్చు

హైదరాబాద్, మే24 (నమస్తే తెలంగాణ): జియోట్యూబ్, జియోటెక్స్‌టైల్ టెక్నాలజీ ద్వారా తక్కువ ఖర్చుతో వరదల నియంత్రణ, కరకట్టల రక్షణ చేపట్టవచ్చని వీరేంద్ర టెక్స్‌టైల్ ఏజెన్సీ ప్రతినిధుల బృందం వెల్లడించింది. యూపీకి చెందిన వీరేంద్ర టెక్స్‌టైల్ ఏజెన్సీస్‌తో నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో బోర్డ్ ఆఫ్ ఇంజినీర్లు శుక్రవారం సమావేశమయ్యారు. జియోటెక్స్‌టైల్, జియోట్యూబ్, జియో మ్యాట్రిస్, రోప్ గేబియన్స్ టెక్నాలజీపై ఏజెన్సీ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇసుకను జియోట్యూబుల్లో నింపి ఒకదానిపై ఒకటి పేర్చే విధానం సమర్థవంతంగా పనిచేస్తుందని, పర్యావరణానికి కూడా అనుకూలమని తెలిపారు.